


## చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 114 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



## టమాట కిలో రూ.7
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.5 పలికింది.

గరిష్టం/కనిష్టం
37.5°/21.2°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### 94 శాతం పింఛన్ల పంపిణీ



బొంతలపల్లి గ్రామంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివానంద

**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలో 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జోరుగా సాగుతోంది. రెండో రోజు మంగళవారం నాటికి 94 శాతం పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో 2,63,587 మంది లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.73.18 కోట్లు మంజూరు చేసింది. తొలిరోజు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన వలంటీర్లు.. రెండోరోజు ఆస్పత్రులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛన్ కానుక మొత్తాన్ని అందజేశారు. ఈ క్రమంలోనే మంగళవారం నాటికి 2,47,179 మందికి రూ.68,62,66,000 మొత్తాన్ని పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పింఛన్ పంపిణీకి మరో మూడు రోజులు గడువు ఉన్నందున వందశాతం పంపిణీ చేస్తామన్నారు.

### ఎడ్యుకేషన్ గ్రాంట్‌కు దరఖాస్తు చేసుకోండి

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాజీ సైనిక కుటుంబాల పిల్లలకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎడ్యుకేషన్ గ్రాంట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అర్హత కలిగిన మాజీ సైనిక కుటుంబాల పిల్లలు అక్టోబరు 31లోపు 'కేంద్రీయ సైనిక బోర్డు వెబ్ సైట్' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హవల్దార్ కింది ర్యాంకులు కలిగిన మాజీ సైనికుల కుటుంబాల వారు, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్సుల్లో పనిచేసిన వారు, మాజీ సైనికుల కుటుంబాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08554–241146 నంబరులో సంప్రదించాలన్నారు.

### దూరవిద్య డిగ్రీ, పీజీ సప్లి ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ దూరవిద్య డిగ్రీ, పీజీ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. బీఏ, బీకాం, బీబీఏ, బీకాం (కంప్యూటర్స్) కోర్సుల్లో మొత్తం 354 మంది పరీక్షలు రాయగా 226 (64 శాతం) మంది ఉత్తీర్ణత చెందారు. ఎంఏ, ఎంకాం, ఎంబీఏ మొత్తం 182 మంది పరీక్షలు రాయగా 143 మంది ఉత్తీర్ణులయ్యారు. రీవాల్యుయేషన్‌కు ఈ నెల 23 చివరి తేదీగా నిర్ధారించారు. డిగ్రీ, పీజీ కోర్సు రీవాల్యుయేషన్ ఫీజు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఫలితాలు www.skucdc.com లో చూడవచ్చు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, దూరవిద్య డైరెక్టర్ మునినారాయణప్ప, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు భరోసా

### దరఖాస్తుకు నేడు ఆఖరు
- ఇప్పటికే జిల్లాలో 3 లక్షల మందికి లబ్ధి
- కొత్తగా 3,934 మంది రైతుల నమోదు





**కదిరి:** విత్తనం వేసింది మొదలు పంట విక్రయించుకునేదాకా రైతు వేసే ప్రతి అడుగులోనూ వైఎస్ జగన్ సర్కార్ తోడుగా నిలుస్తోంది. ముఖ్యంగా రైతులు పెట్టుబడి కోసం ఇతరుల వద్ద చేయి చాపకుండా ఆర్థికంగా ఆదుకుంటోంది. ఏటా పెట్టుబడి సాయం రూ.12,500 నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తానని ముందుగా ప్రకటించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి...ఆ తర్వాత దానికి మరో రూ.1,000 అదనంగా చేర్చి ఏటా మూడు విడతల్లో రూ.13,500 నేరుగా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. ఈ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ 2019 అక్టోబర్ 15న ప్రారంభించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ యోజన నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందజేసే మరో రూ.7,500 ఇలా మొత్తం కలిసి 'పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో రైతులకు పెట్టుబడి కోసం ఏటా రూ.13,500 అందిస్తున్నారు.

**రైతన్నా మేలుకో...**

'పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా' పథకానికి అర్హులై ఉండీ నేటికీ పథకం అందకోలేని వారికి ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల 3వ తేదీతో (బుధవారం) రైతు భరోసా దరఖాస్తుకు గడువు ముగియనుండగా, రైతులు అప్రమత్తం కావాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఇప్పటికే 'వైఎస్సార్ రైతు భరోసా' పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

**కొత్తగా దరఖాస్తుకు కావాల్సినవి**

భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు, ఫోన్ నంబర్‌తో లింక్ అయి ఉన్న బ్యాంకు పాసు పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో.

**ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే..**

ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రైతు భరోసా కేంద్రంలో కానీ లేదంటే మండల వ్యవసాయాధికారిని గానీ సంప్రదిస్తే వారు దరఖాస్తు చేసుకోవడానికి సహాయ పడతారు. లేదంటే అందుబాటులో ఉన్న వార్డు లేదా గ్రామ వలంటీర్‌ను కలిసినా 'వైఎస్సార్ రైతు భరోసా' పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియజెపుతారు.

**జిల్లాలో 'వైఎస్సార్ రైతు భరోసా' లబ్ధిదారులు ఇలా..**

| సంవత్సరం | రైతుల సంఖ్య | మొత్తం |
|---|---|---|
| 2019-20 | 2,56,170 | రూ.348.07 కోట్లు |
| 2020-21 | 2,78,337 | రూ.358.04 కోట్లు |
| 2021-22 | 2,70,443 | రూ.361.26 కోట్లు |
| 2022-23 (మొదటి విడత) | 2,63,526 | రూ197.64 కోట్లు |
| మొత్తం | 10,68,476 | రూ1,265.01 కోట్లు |



### అర్హతే ప్రామాణికం
దివంగత నేత వైఎస్సార్‌లాగే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రైతులంటే ఎంతో ఇష్టం. అందుకే రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడకుండా 'రైతు భరోసా' అమలు చేస్తున్నారు. ఎవరి సిఫారసు లేకుండా అర్హతే ఆధారంగా ఏటా రూ.13,500 చొప్పున నేరుగా ఖాతాల్లోనే జమ చేస్తున్నారు.

–వై.శ్రీధర్‌రెడ్డి, రైతు, నల్లచెరువు మండలం



### దరఖాస్తు చేసుకోండి
'వైఎస్సార్ రైతు భరోసా' పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.350 కోట్లకుపైగా నిధులు జిల్లాలోని రైతుల ఖాతాల్లా జమచేస్తోంది. ఇంకా ఈ పథకం పొందుకోలేని అర్హులు ఎవరైనా ఉంటే ఈ నెల 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 3,934 మంది రైతులు కొత్తగా 'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకున్నారు.

–వైవీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

## చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలి
- ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం



సోమందేపల్లి: మాట్లాడుతున్న ఎస్పీ మాధవ రెడ్డి

**పరిగి/సోమందేపల్లి:** సరిహద్దు మండలాల్లోని చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన పరిగి, సోమందేపల్లి మండలాల్లో పర్యటించారు. తొలుత పరిగి మండలం ఎం.చెర్లోపల్లి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును పరిశీలించారు. కర్ణాటకలో త్వరలోనే ఎన్నికలు జరగనున్నందున మద్యం, డబ్బు పంపిణీని అడ్డుకునేందుకు తనిఖీలు ముమ్మరంగా చేయాలన్నారు. ప్రతి వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేసి తర్వాత జిల్లాలోకి అనుమతి ఇవ్వాలన్నారు. అంతకుముందు ఆయన సోమందేపల్లి పోలీస్ స్టేషన్‌కు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం రేణుకానగర్ వద్ద ఎమ్మెల్యే శంకర నారాయణ కాన్వాయ్‌పై జరిగిన దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు నిఘా లేకుంటే ఎలా..? అని పోలీసులను ప్రశ్నించారు. ఎస్పీ వెంట డీఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐ కరుణాకర్, ఎస్ఐ విజయ్ కుమార్ ఉన్నారు.

## స్కిల్ హబ్‌లో నూతన కోర్సు
**హిందూపురం:** స్కిల్ హబ్‌ల ద్వారా ప్రభుత్వం యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా నూతన కోర్సులు ప్రవేశపెట్టి యువత నైపుణ్యం సాధించేలా చూస్తోంది. ఈ క్రమంలోనే హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో 'కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్' కోర్సు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరీష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యుమ్ తెలిపారు. మే నెల 4తేదీ నుంచి కోర్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణ, డిగ్రీ ఆపైన చదివిన యువత అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు 82975 25703 నంబరులో లేదా, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చునన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

# పంట ఇక తడవదు!

- రైతుల కోసం మల్టీపర్పస్ గోదాముల నిర్మాణం
- ఇప్పటికే 53 గోడౌన్ల నిర్మాణం పూర్తి
- 1000 టన్నుల ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం

- ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షాలతో కల్లంలోనే తడిసిపోతే ఆ రైతు బాధ అంతా ఇంతా కాదు. ఏడాది రైతు కుటుంబం పడిన కష్టంతో పాటు పెట్టుబడులూ వానలో కొట్టుకుపోతాయి.
- ప్రకృతి కరుణించి పంట చేతికందినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోతే రైతు దిక్కుతోచని స్థితిలో పడతాడు. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారి ఇచ్చింది తీసుకుని రెక్కలకష్టం అప్పగించాల్సిన పరిస్థితి.

..ఇలా రైతులు పంటకు గిట్టుబాటు ధర లేక పోయినా, ఆకాల వర్షాలు వచ్చినా అప్పులు మూటగట్టుకుంటున్నారు. దీన్ని గుర్తించిన వైఎస్ జగన్ సర్కార్ వ్యవసాయ బహుళ ప్రయోజనాల గోదాముల నిర్మాణాలు చేపట్టింది. దీంతో వానొచ్చినా పంటను కాపాడుకునే అవకాశం ఉంటుంది. ధర లేనప్పుడు గోదాముల్లో భద్రపరచి ఆ తర్వాత అమ్ముకునేందుకు ఆస్కారం దొరుకుతోంది.

**పుట్టపర్తి:** జిల్లాలో చాలా ప్రాంతాల్లో గోదాములు లేవు. ఒకటీ, అరా ప్రైవేటువి ఉన్నా రైతు భరించలేనంత అద్దె ఉంటుంది. అందువల్ల రైతులు దిగుబడులు నిల్వ చేసుకునే వీలులేక పొలం మీదే అమ్మేసుకుంటున్నాడు. ఇక చాలా మంది రైతులకు కనీసం కల్లాలు లేక ధాన్యం ఆరబెట్టుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం వ్యవసాయ బహుళ (మల్టీపర్పస్) ప్రయోజనాల గోదాముల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది.



లోచర్లలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గోడౌన్

**180 గోదాముల నిర్మాణం**

జిల్లాకు 180 గోదాములు మంజూరయ్యాయి. ఇవన్నీ రైతు భరోసా కేంద్రం, సొసైటీ ఆధీనంలో ఉంటాయి. తొలి విడతలో 72 గోదాములకు అనుమతులు ఇవ్వగా, ఇప్పటికే 53 గోదాములు నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. రెండో దశలో 55, మూడో దశలో 53 గిడ్డంగుల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. రెండో దశలో మంజూరైన వాటికి అధికారులు స్థలాన్ని గుర్తించగా, మూడో దశలో మంజూరైన వాటికి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది.

**55 సెంట్ల విస్తీర్ణంలో గోదాము**

ఒక్కో గోదాముకు ప్రభుత్వం 55 సెట్లు స్థలం కేటాయించింది. ఈ స్థలంలో గోడౌన్ నిర్మాణంతో పాటు ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్లాట్ ఫాం నిర్మిస్తున్నారు. 55 సెంట్లలో నిర్మించే గోదాములో 1,000 మెట్రిక్ టన్నులు ధాన్యం నిల్వ ఉంచుకోవచ్చు. ఇందుకోసం రూ. 60 లక్షల నుంచి 65 లక్షలు దాకా ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 30 సెంట్లలో నిర్మించే గోదాములో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచుకోవచ్చు. ఇందుకోసం రూ.35 లక్షల నుంచి 40 లక్షల మేర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అంతేకాకుండా ఈ గోదాముల నిర్మాణాల కోసం ప్రభుత్వం జిల్లా సహకారం కేంద్ర బ్యాంకు నుంచి నిధులు కేటాయించింది.

**రైతులకు బహుళ ప్రయోజనం**

గిడ్డంగులు అందుబాటులోకి వస్తే రైతులు మేలు జరగనుంది. పంటకు గిట్టు బాటు ధర వచ్చేంత వరకూ నిల్వ చేసుకోవడంతో పాటు పంటను ఆరబెట్టుకునేందుకు అవకాశం కలుగుతుంది.



### రైతులకు వరం
వ్యవసాయ బహుళ ప్రయోజనాల గోదాములు రైతులకు వరంగా మారనున్నాయి. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత పెద్ద ఎత్తున గోదాములు నిర్మించిన దాఖలాలు లేవు. జిల్లాకు 180 గోదాములు మంజూరు కాగా, ఇప్పటికే 53 గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం.

– ఆవుటాల రమణారెడ్డి, చైర్మన్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు

# ఇంటర్న్‌షిప్ తప్పనిసరి



కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

- విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి
- సామాజిక బాధ్యత కల్పించాలి
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

**అనంతపురం:** డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి అని ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం అనుబంధ ప్రిన్సిపాళ్లతో వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఇంటర్న్‌షిప్ దోహదపడుతుందన్నారు. కళాశాలలకు, పరిశ్రమకు మధ్య అంతరం తగ్గాలంటే విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. అలాగే విద్యార్థుల్లో సామాజిక బాధ్యత కల్పించాల్సిన అవసరం, సమాజ అభ్యున్నతిలో విద్యార్థుల పాత్ర గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమాజహిత ప్రాజెక్టులు విజయవంతం చేయాలన్నారు. అనంతరం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన మాట్లాడుతూ విద్యార్థులు, ప్రొఫెసర్లు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి 15 రోజులకు ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన నివేదికలు ప్రిన్సిపాళ్లకు పంపాలన్నారు. స్వయం, ఎస్‌పీటీఈఎల్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఐఎస్‌టీఈ చాప్టర్లు అన్ని కళాశాలల్లోనూ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఇ.కేశవరెడ్డి, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ బి.ఈశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌జైన్, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు

# సాకులు చెప్పకండి

- గృహ నిర్మాణాల్లో పురోగతి కన్పించాలి
- ఇళ్లు లేని వారు జిల్లాలో ఒక్కరూ ఉండకూడదు
- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

**పుట్టపర్తి అర్బన్:** ''ఇళ్ల నిర్మాణాలకు కావాల్సినంత నిధులు అందుబాటులో ఉన్నాయి. ఇసుక ఇతరత్రా సామగ్రికి ఇబ్బంది లేదు. లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన పనులు జరుగుతున్నాయి. అయినా జిల్లాలో ఇళ్ల నిర్మాణాల్లో ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. ప్రశ్నిస్తే ఏదో సాకు చెబుతున్నారు. ఇక నుంచి ఇలాంటివి కుదరదు. ఇళ్ల నిర్మాణాల్లో రోజువారీ పురోగతి కనిపించాలి. పని చేయని వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవని గుర్తించుకోండి'' అని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అజయ్‌జైన్ మాట్లాడుతూ, పీఎంఏవై కింద జిల్లాకు 62,253 మంజూరు కాగా, ఇప్పటి వరకూ 55,750 ఇళ్లను రిజిస్ట్రేషన్ చేశారన్నారు. బిలో బేస్‌మెంట్ స్థాయిలో 22,563 ఉండగా, బేస్‌మెంట్ స్థాయిలో 15,759 ఉన్నాయన్నారు. 52,798 ఇళ్ల గ్రౌండింగ్ కాగా, 9,542 ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణంలో పురోగతి తక్కువగా ఉందన్నారు.

**తక్కువ ధరకే స్టీలు, సిమెంట్**

ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోందని అజయ్‌జైన్ తెలిపారు. అదనంగా రూ.35 వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాన్ని అందిస్తోందన్నారు. మొత్తం రూ.2.15 లక్షలతో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. దీంతోపాటు మార్కెట్ కంటే తక్కువ ధరకే సిమెంటు, స్టీలు, ఫ్రేమ్‌లు, ఉచితంగా 20 టన్నుల ఇసుక ఇవ్వడంతో పాటు జగనన్న కాలనీల్లో ల్యాండ్ లెవలింగ్, రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర వసతులు కల్పిస్తున్నామన్నారు.

**మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్**

జిల్లాలో నాలుగు డివిజన్లు ఉండగా ఒక్కో డివిజన్‌కు ఒక సీనియర్ అధికారిని నియమించి ఇళ్ల నిర్మాణాల వేగం పెంచాలని అజయ్‌జైన్ ఆదేశించారు. వీటి పర్యవేక్షణకు మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి వారంలో ఒక రోజు లేఅవుట్లలో తనిఖీ చేయాలన్నారు. చిలమత్తూరు మండలంలో 85 శాతం పురోగతి ఉండడంతో సంబంధిత హౌసింగ్ ఏఈ, ఎంపీడీఓలను అభినందించారు.

**122 లేఅవుట్లలో విద్యుత్ పనులు పూర్తి**

జిల్లాలోని 142 లేఅవుట్లలో 122 లేఅవుట్లలో విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశారని, తక్కిన 22 లేఅవుట్లలో నెలాఖరులోపు పూర్తి చేయాలని అజయ్‌జైన్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కోసం మండలాల వారీగా స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తున్నామన్నారు. వెయ్యి ఇళ్లు ఉన్న కాలనీకి ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, తిప్పేనాయక్, రాఘవేంద్ర, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, డ్వామా పీడీ రామాంజనేయులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్‌రెడ్డి, ఎంపీడీఓలు, కమిషనర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గరుడ వాహనంపై శ్రీవారు



గరుడ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులు

**ధర్మవరం అర్బన్:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధర్మవరంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి.. దేవేరులతో కలసి మంగళవారం గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం శేష వాహనం, రాత్రి గజ వాహనంపై స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహించారు.

**నేడు రథోత్సవం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలకు మడుగు తేరును స్వయంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దంపతులు రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

### విధుల్లోకి జెడ్పీ సీఈఓ

**అనంతపురం సిటీ:** జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) భాస్కరరెడ్డి మంగళవారం విధులకు హాజరయ్యారు. అనారోగ్య కారణాలతో మూడ్రోజుల క్రితం ఆయన సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. ఆరోగ్యం కుదుట పడడంతో మంగళవారం ఆయన యథావిధిగా విధులకు హాజరయ్యారు.

### ముగిసిన నామినేషన్ల పరిశీలన

**అనంతపురం సిటీ:** అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎస్. కుమార్ తెలిపారు. 11 డైరెక్టర్ స్థానాలకు మొత్తం 30 నామినేషన్లు దాఖలు కాగా, అన్నీ సక్రమంగా ఉన్నాయని వివరించారు. నామినేషన్ల ఉపసంహరణ బుధవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. బరిలో నిలిచే అభ్యర్థులకు వెంటనే గుర్తులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

### తల్లీపిల్లల అదృశ్యం



అదృశ్యమైన తనూజ, పిల్లలు (ఫైల్)

**గుడిబండ:** కుటుంబ సమస్యల నేపథ్యంలో పిల్లలతో సహా ఓ వివాహిత కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. గుడిబండ మండలం ముతిగుబ్బ గ్రామానికి చెందిన తిరుమలేష్, తనూజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె శ్రీలేఖకు 8 ఏళ్లు, రెండో కుమార్తె సౌజన్యకు 6 ఏళ్లు, కుమారుడు కార్తీక్‌కు ఐదేళ్లు. ఏప్రిల్ 27న పిల్లలను తీసుకుని తనూజ ఇల్లు విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భర్త తిరుమలేష్ పలు ప్రాంతాల్లో గాలించాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.

# చెంతనే శిక్షణ... భవితకు రక్షణ

- డిప్లొమాతోనే కొలువులు
- 18 ఏళ్ల వయస్సులోనే రూ.4 లక్షల వార్షిక వేతనం
- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 119 మందికి ఉద్యోగాలు
- నేడు 'ఉద్యోగ విజయోత్సవం'





**అనంతపురం:** డిప్లొమా పూర్తయిన వెంటనే ఉద్యోగాలు దక్కుతున్నాయి. పట్టుమని 18 ఏళ్ల వయసులోనే అత్యంత ఆకర్షణీయమైన కొలువులు వరిస్తున్నాయి. అనంతపురం జిల్లాలో భారీ తరహా పరిశ్రమలు ఏర్పాటు కావడంతో డిప్లొమా విద్యార్థులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కియా వంటి పరిశ్రమల్లో డిప్లొమో పూర్తి చేసిన వారికి తొలి ప్రాధాన్యతనిస్తున్నారు. కియా ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడంతో కొలువులకు తగినట్లుగా నైపుణ్యత కలిగిన మానవ వనరుల ఉత్పత్తికి దోహదపడుతోంది. ఇందుకోసం అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేకంగా ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఇప్పటి వరకూ ఏకంగా 119 మంది విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు దక్కాయి. ఈ క్రమంలో బుధవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు.

| కంపెనీ | ఎంపికైన విద్యార్థుల సంఖ్య | వార్షిక వేతనం |
|---|---|---|
| బ్లూస్టార్ | 01 | రూ.3.9 లక్షలు |
| అల్ట్రాటెక్ | 06 | రూ.4లక్షలు |
| ఎల్ట్రోనిక్స్ | 04 | రూ.2.6లక్షలు |
| ఫస్ట్ సోలార్ ప్రైవేట్‌లిమిటెడ్ | 25 | రూ.2.16లక్షలు |
| జేఎంసీ ప్రాజెక్ట్స్ | 11 | రూ.3.2 లక్షలు |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 10 | రూ.2.16 లక్షలు |
| స్మైల్ ఎలక్ట్రానిక్స్ | 62 | రూ.1.44 లక్షలు |

### చక్కటి శిక్షణ



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అల్ట్రాటెక్ కంపెనీలో ఉద్యోగం దక్కింది. పరిశ్రమలో ఉపయోగించే ప్రాథమిక పరికరాలు, విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తోటివారితో ప్రవర్తించాల్సిన తీరుపై చక్కటి శిక్షణ ఇచ్చారు. సబ్జెక్టుకు సంబంధించి అధ్యాపకులు ఎప్పటికప్పుడు నూతన అంశాలను బోధిస్తున్నారు. దీంతో చాలా సులువుగా ఉద్యోగం దక్కింది.

– అంకేపల్లి రాకేష్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్

### ప్రయోగాత్మక శిక్షణ



రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.2.16 లక్షల వేతనం ఇస్తామంటూ ఆఫర్ లెటర్ ఇచ్చారు. డిప్లొమోలోనే మాకు ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. విడిభాగాల గురించి పూర్తి స్థాయి అవగాహన వచ్చింది. మౌలికాంశాలపై శిక్షణ ఇవ్వడంతో మాకు సులువుగా ఉద్యోగాలు దక్కాయి. ఇందుకు సహకరించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– ఎం.మల్లికార్జున, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్

### అందరి సహకారంతోనే



అందరి సహకారంతోనే విద్యార్థులకు న్యాయం చేయగలిగాం. అకడమిక్ పరంగా బలోపేతం చేయడమే కాకుండా పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ తీసుకున్న చొరవ మాటల్లో చెప్పలేం. క్యాంపస్ ఇంటర్వ్యూలకు సంబంధించి మూడు కంపెనీల ఫలితాలు రావాల్సి ఉంది.

– కె.మల్లికార్జున, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్

### 75 శాతం స్థానికులకే



వివిధ పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ ప్రాంత విద్యార్థులకు అత్యధికంగా ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. డిప్లొమా ఉత్తీర్ణత కాగానే ఉద్యోగాలు దక్కేలా శిక్షణ ఇస్తున్నాం. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఇంటర్వ్యూ తర్ఫీదు, రెజ్యూమ్ ప్రిపేర్ చేసే విధానంపై అవగాహన కల్పించాం. కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుతోనే ఈ ప్రాజెక్ట్ విజయవంతమైంది. ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారంటూ ప్రతి వారమూ మా కమిషనర్ నివేదిక కోరుతుంటారు. క్యాంపస్ డ్రైవ్‌లే కాకుండా క్లస్టర్ డ్రైవ్‌లు నిర్వహించి పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం.

– సి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం

### నాగభూషణరెడ్డి సస్పెన్షన్

**పెనుకొండ:** పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణరెడ్డిని సస్పెండ్ చేస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ మంగళవారం తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకుగాను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు వివరించారు. భవిష్యత్తులో ఆయన చేపట్టే ఏ కార్యక్రమమూ పార్టీతో ముడిపడి ఉండదని స్పష్టం చేశారు.

### 'రీ-పోస్టుమార్టం చేయండి'

**కొత్తచెరువు:** తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, రీ పోస్టుమార్టానికి అనుమతించాలని కోరుతూ మంగళవారం ఎస్పీ మాధవరెడ్డికి మృతుని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన ఓబుళపతి పెద్ద కుమారుడు బొమ్మ శంకర్ ఇటీవల అనుమానాస్పద మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని రామగిరి మండల సరిహద్దులో పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని బాధితులు వాపోయారు. ఘటన జరిగిన రోజు తమ కుమారుడిని మాదిగ కిష్టప్ప కుమారుడు ఓబులేసు పిలుచుకుపోయాడని, మద్యం తాపించి పథకం ప్రకారమే మరో ముగ్గురితో కలసి ఓబులేసు హతమార్చి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఇటీవల వారే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బయటపడ్డారని వివరించారు. దీంతో తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, మృతదేహాన్ని మరోసారి పోస్టుమార్టం నిర్వహించి, వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

- 24 గంటల్లోపే నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి

**గుంతకల్లు:** కర్నూలు జిల్లా ఆదోని జీఆర్పీ పరిధిలో చోటు చేసుకున్న ఓ చిన్నారి కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది. కేసు నమోదైన 24 గంటల్లోపే నిందితులను అరెస్ట్ చేసి, చిన్నారిని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను గుంతకల్లు రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి వెల్లడించారు.

**ఏం జరిగింది?**

మంత్రాలయం నియోజకవర్గం కాచీపురానికి చెందిన వడ్డె ఆంజనేయులు, అంకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలతో పాటు ఏడు నెలల వయసున్న కుమారుడు రాము ఉన్నారు. భిక్షాటనతో జీవనం సాగిస్తున్న ఆంజనేయులు దంపతులు... ఈ నెల 29న రాత్రి వర్షం కురుస్తుండడంతో మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర పాత రైల్వే స్టేషన్ భవనంలో నిద్రించారు. 30వ తేదీ తెల్లవారుజామున నిద్రలేచిన అంకమ్మ.. తన పక్కన బిడ్డ లేకపోవడంతో వెంటనే భర్తను నిద్రలేపి చుట్టుపక్కల గాలింపు చేపట్టింది. ఆచూకీ లభ్యం కాకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఆదోని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు.

**పట్టించిన సీసీ కెమెరాలు**

ఆదోని జీఆర్పీ సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న రైల్వే ఎస్పీ చౌడేశ్వరి వెంటనే స్పందించారు. గుంతకల్లు రైల్వే డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నగేష్‌బాబు, ఆదోని ఎస్‌ఐ ఎం.రామస్వామి ఆగమేఘాలపై తుంగభద్ర పాత రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుని పరిశీలించారు. అక్కడికి సమీపంలోని దుకాణాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గమనించి, అందులోని ఫుటేజీలను పరిశీలించారు. వేకువజామున ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వెళ్లినట్లుగా గుర్తించారు. సీసీ ఫుటేజీలోని దుండగుల చిత్రాల ఆధారంగా తమ వద్ద ఉన్న పాత నేరస్తుల రికార్డులను పరిశీలించి చిన్నారిని కిడ్నాప్ చేసింది కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన షేక్ మహమ్మద్ మహబూబ్, మహమ్మద్ అఫ్జల్‌ఖాన్‌గా గుర్తించారు. వారి కదలికలపై నిఘా వేసిన జీఆర్పీ సిబ్బంది గుంతకల్లులోని శంకరనందగిరిస్వామి కళాశాల మైదానంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బాలుడిని విక్రయించేందుకు కిడ్నాప్ చేసినట్లుగా వెల్లడైంది. దీంతో బాలుడిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన గుంతకల్లు నివాసి వలిబాషాను సైతం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని అంకమ్మ, ఆంజనేయులు దంపతులకు అప్పగించారు.

**రూ.3లక్షలకు ఒప్పందం**

పదేళ్ల క్రితం వివాహమైన వలిబాషాకు పిల్లలు లేరు. దీంతో ఎవరైనా అనాథ పిల్లలను పెంచుకోవాలని వలిబాషా దంపతులు అనుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాయచూరులో ఉంటున్న తన అక్క తహీరాబేగం ఇంటికి వలిబాషా వెళ్లాడు. ఆ సమయంలో తన అక్క ఇంటి సమీపంలో ఉంటున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ మహబూబ్‌తో పరిచయమైంది. మాటల్లో తాను అనాథ పిల్లలను పెంచుకోవాలని అనుకుంటున్నట్లు వలిబాషా తెలపడంతో తనకు రూ.3 లక్షలు ఇస్తే నెలల వయసులో ఉన్న చిన్నారిని తీసుకొచ్చి అప్పగిస్తానని ఆటో డ్రైవర్ పేర్కొన్నాడు. దీంతో డీల్ ఒప్పుకున్న వలిబాషా... పలు దఫాలుగా ఫోన్‌పే ద్వారా మహబూబ్‌కు రూ.1.90 లక్షలు పంపాడు. అప్పటికే అఫ్జల్‌ఖాన్‌తో కలసి బాలుడిని కిడ్నాప్ చేయాలని పథకం వేసిన మహబూబ్.. భిక్షాటన చేస్తూ కనిపించిన ఆంజనేయులు, అంకమ్మ దంపతుల 7 నెలల కుమారుడిపై దృష్టి పడింది. దీంతో ఫిబ్రవరిలో చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి, విఫలమయ్యారు. అనంతరం గత నెల 29న పక్కా ప్లాన్‌తో చిన్నారిని కిడ్నాప్ చేశారు.

**జీఆర్పీ సిబ్బందికి అభినందన**

కిడ్నాప్ కేసును ఛేదించడంలో చొరవ చూపిన జీఆర్పీ సీఐ నగేష్‌కుమార్, ఆదోని ఆర్‌ఐ ఎస్‌ఐ ఎం.రామస్వామి, గుంతకల్లు ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, శివరామ్, సాయి, కానిస్టేబుళ్లు గాదిలింగ, గోపాల్‌ను ఎస్పీ చౌడేశ్వరి అభినందించారు. రివార్డు కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలను పెంచుకోవాలనే వలిబాషా తపన మంచిదే కానీ, అయన ఎంచుకున్న పద్ధతి సరియైనది కాదన్నారు. దీంతో ఈ కేసులో వలిబాషాను కూడా నిందితుడిగా చేర్చి మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## '108'ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



అంబులెన్స్‌లో ఇరుక్కుపోయిన పైలెట్ లోకేష్‌ను వెలికి తీస్తున్న స్థానికులు

**కదిరి అర్బన్** అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 అంబులెన్స్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మంగళవారం ఉదయం ఎన్పీకుంట మండలం జోగివారిపల్లికి చెందిన రాజారెడ్డి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం రోగిని తీసుకుని కదిరి ఏరియా ఆస్పత్రికి బయలుదేరారు. రోగితో పాటు అతని తల్లి కళ్యాణమ్మ, తండ్రి భాస్కరరెడ్డి, బంధువు సుధాకరరెడ్డి ఉన్నారు. కదిరి మండలం గంగన్నవారిపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. 108 అంబులెన్స్ పైలెట్ లోకేష్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అదే వాహనంలో రోగి రాజారెడ్డి, కళ్యాణమ్మ, భాస్కరరెడ్డి, సుధాకర్‌రెడ్డికూ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై అతి కష్టంపై పైలెట్‌ను వెలికి తీశారు. అనంతరం క్షతగాత్రులను మరో 108 అంబులెన్స్‌లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న పైలెట్ లోకేష్‌ను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## జగనన్న కాలనీల్లో వసతులు కల్పించండి

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఆదేశం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలిస్తున్న అజయ్‌జైన్, కలెక్టర్ అరుణ్‌బాబు

**గోరంట్ల:** జగనన్న కాలనీల్లో మౌళిక వసతులు కల్పించే పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి మల్లాపల్లి సమీపంలోని జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఇతర అధికారులతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. కాలనీలో 299 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని తెలిపారు. మరికొందరు బతుకుదెరువు కోసం బెంగళూరుకు వెళ్లారని, అందువల్లే ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో అజయ్‌జైన్ స్పందిస్తూ..పనులు చేసుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారితో సచివాలయ ఇంజినీర్లు మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన కాలనీ మొత్తం తిరిగి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం సరిగా లేదని పలువురు ఆయనకు తెలపగా, జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్ తదితర మౌళిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబుకు సూచించారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని, వారంలోపు జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలన్నీ కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా పంచాయతీరాజ్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈ నాగరాజు, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీపీ ప్రమీల, మల్లాపల్లి సర్పంచ్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాకు చేరిన 'వాక్ ఇన్ కూలర్లు'



పుట్టపర్తి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వాక్ ఇన్ కూలర్

**పుట్టపర్తి అర్బన్:** పశువులు, జీవాల్లో వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా వేసే టీకాలను నిల్వ చేసేందుకు వీలుగా నాలుగు వాక్ ఇన్ కూలర్లను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. జిల్లా కేంద్రానికి మంగళవారం చేరుకున్న ఈ కూలర్లను జిల్లా పశువైద్యాధికారి శుభదాస్ పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఈ కూలర్లలోకి ఏకంగా మనిషి నడిచి వెళ్లవచ్చు. ఒక్కో కూలర్ విలువ రూ.17 లక్షలు ఉంటుందని డాక్టర్ శుభదాస్ వెల్లడించారు. వీటిని గోరంట్ల, పుట్టపర్తి, లేపాక్షి, ధర్మవరంలోని పశు సంవర్ధక శాఖ ఏరియా ఆస్పత్రుల్లో అమర్చారు. ఒక్కో కూలర్‌లో సుమారు ఐదారు మండలాల్లోని పశువుల సంఖ్యకు సరిపడా మందులను నిల్వ చేయనున్నారు.

### మరింత బాధ్యతగా పనిచేయండి : డీఎంహెచ్‌ఓ

**ధర్మవరం రూరల్:** గ్రామ స్థాయిలో మరింత బాధ్యతగా పనిచేయాలని ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం బత్తలపల్లి పీహెచ్‌సీలో జరిగిన ఆశ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మవరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సెలివ్రయా, వైద్య ఆరోగ్య కార్యాలయ ఇన్‌చార్జ్ ఏఓ డాక్టర్ చెన్నారెడ్డి, మీడియా అధికారి బాబా ఫక్రుద్దీన్, ఎఎస్‌ఓ సూర్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి గంగిరెడ్డి, పర్యవేక్షక సిబ్బంది వేమారెడ్డి, నారమ్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రాణం తీసిన ఈత సరదా

**పావగడ:** తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళికి చెందిన వైఎన్ హళ్లి గ్రామంలో ఈత కొట్టేందుకు వెళ్లిన గణేష్ (12) నీట మునిగి మృతి చెందాడు. గ్రామానికి చెందిన మారణ్ణ కుమారుడు గణేష్ పాఠశాలకు సెలవుల కారణంగా ఇంటి పట్టునే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తోటి పిల్లలు ఈత కొడుతుండగా చూసి ఒక్కడే బావిలో దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### గుర్తుతెలియని వృద్ధుడి మృతి



**హిందూపురం:** స్థానిక పంచాజన్య స్కూల్ సమీపంలో పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడు (60) రైలు ఢీకొని మృతి చెందాడు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ మంగళవారం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని కోరారు.

### ఇంటర్ సప్లిమెంటరీలో వంద శాతం ఫలితాలు సాధించాలి

**పుట్టపర్తి అర్బన్:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఇంటర్ స్థాయి విద్యాశాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. ఇంటర్ ఫలితాల్లో తక్కువ శాతం ఉత్తీర్ణత నమోదు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం సప్లిమెంటరీ పరీక్షల్లోనైనా వంద శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చి దిద్దాలని ఆదేశించారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ ఇప్పించి పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఆర్‌ఐఓ సురేష్‌బాబు, డీవైఈఓ రఘునాథరెడ్డి, గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలల అధికారి దాదాపీర్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కళాశాలల అధికారి మోహన్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో మైనర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు, ద్విచక్ర వాహనాన్ని చూపుతున్న పోలీసులు

**చిలమత్తూరు:** చిరుప్రాయంలోనే జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను చిలమత్తూరు ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం వెల్లడించారు. గత నెల 28న అర్ధరాత్రి చిలమత్తూరులోని సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగింది. ఘటనపై స్టోర్స్ యజమాని అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కొడికొండ చెక్‌పోస్టు వద్ద ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకెళుతున్న ముగ్గురు మైనర్లను అటకాయించి వివరాలు ఆరా తీస్తే పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. దీంతో వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. హిందూపురానికి చెందిన ముగ్గురు బాలలు... చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బు కోసం దొంగతనాలకు తెరలేపారు. ఈ క్రమంలో సూపర్ మార్కెట్‌లో చొరబడి రూ.35 వేలు అపహరించుకెళ్లారు. ఇందులో రూ.25 వేలు ఖర్చు చేశారు. దీంతో బాలలపై కేసు నమోదు చేసి, రూ.10వేలు నగదు, ఓ ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అనంతపురంలోని బాలల పరివర్తన న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.